వైభవంగా

కళ్లలగర్ రథోత్సవం





అళగర్‌మలై ఆలయం నుంచి బయలుదేరుతున్న మహారథం, (ఇన్‌సెట్‌లో) రథంలో ఆశీనులైన ఇష్టదేవేరులతో కళ్లలగర్ పెరుమాళ్

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని అళగర్‌మలై వద్ద తిరుమాళిరుంజోలై, తెన్‌తిరుపతిగా కీర్తింపడుతున్న అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన కళ్లలగర్ ఆడి మాస రథోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఆడి ఉత్సవాలు ఈ నెల ఒకటిన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ శ్రీదేవి, భూదేవి సమేత కళ్లలగర్ పెరుమాళ్ వివిధ వాహనాల్లో విహరించారు. ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన ఆడి రథోత్సవం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఇష్టదేవేరులతో సుందరేశపెరుమాళ్ ఉదయం 8.40 గంటలకు సర్వాలంకరణశోభితులై రథంలోని ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఉదయం 9 గంటలకు భక్తులు రథం మోకుతాళ్ళను పట్టుకుని లాగుతూ వెళ్లారు. ఈ వేడుకల్లో మంగళవాయిద్యాల నడుమ చందనపు కలశాలను ఊరేగింపు తీసుకెళ్ళి పదినెట్టాంబడి కరుపణ్ణసామి ఆలయంలో భక్తులు సమర్పించారు. ఆ సందర్భంగా మేకపోతులు, కోళ్ళను బలులిచ్చి పొంగళ్లు పెట్టారు. మదురై జిల్లా ఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో సుమారు వెయ్యిమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అళగర్‌మలైన నూపుర గంగ రాక్కాయి అమ్మన్, ఆరాంపడైవీడు సోలమైల మురుగన్, మూలవర్ కళ్ళలగర్ పెరుమాళ్, పదినెట్టాంబడి కరుప్పణ్ణసామి తదితర ఆలయాల వద్ద భక్తులు నేతీ దీపాలు పట్టుకుని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ రథోత్సవంలో మంత్రి మూర్తి, తక్కర్ వెంకటాచలం, డిప్యూటీ కమిషనర్ రామసామి, మేలూరు ఎమ్మెల్యే పెరియపుల్లాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు మదురై, దిండుగల్, తేని, విరుదునగర్, రామనాథపురం, శివగంగ, తిరునల్వేలి, చెన్నై తదితర జిల్లాల నుండి, పొరుగు రాష్ట్రం కేరళ నుండి కూడా భక్తులు తరలివచ్చారు.

చెన్నై నుంచి కుమరి వరకు

పేదలకు ఇళ్ల పట్టాలు

- విద్య, వైద్య రంగాల్లో ఊహించని ప్రగతి
- ఇవన్నీ చూసే ఈపీఎస్‌కు కడుపుమంట
- సీఎం స్టాలిన్ ధ్వజం



తాంబరంలో ప్రభుత్వాస్పత్రిని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు బలహీన వర్గాలందరికీ ఇళ్ల పట్టాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. చెంగల్పట్టు జిల్లా తాంబరం శానిటోరియం వద్ద రూ.115 కోట్లతో నిర్మించిన జిల్లా ప్రధాన ఆస్పత్రి నూతన భవనాన్ని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ జిల్లాలవారీగా తాను పాల్గొనే ప్రభుత్వ కార్యక్రమాల్లో బలహీనవర్గాలు, నిరుపేదలకు వీలైనంతగా ఇంటి నివేశన పట్టాలను అందజేస్తున్నానని, ఆ మేరకు గత నాలుగేళ్లలో 17.74 లక్షల మందికి ఇంటి నివేశన పట్టాలు అందించామన్నారు. విద్య వైద్య రంగాల్లో ఊహించని ప్రగతి సాధిస్తున్నామని, ఆర్థికపరంగా కూడా రాష్ట్రం పురోగమిస్తోందని, ఇటీవలే 11.19 శాతం ఆర్థిక పురోగతి సాధించినట్లు కేంద్రమే ప్రకటించిందని, ఇలా డీఎంకే ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుండటాన్ని చూసి ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి కడుపుమంటతో తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సభలో రూ. 7.24 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ దంతవైద్యశాల, రూ.1.90 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ భవనాన్ని, 3 పట్టణ ఉప - ఆరోగ్య కేంద్రాలను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 20వేల మందికిపైగా లబ్ధిదారులకు ఆయన ఇంటి నివేశన పట్టాలు అందజేశారు. ఈ సభలో ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్య, వైద్య రంగాలకే అధిక ప్రాధాన్యత ఇస్తోందని అదే సమయంలో ప్రజలకు కనీస అవసరమైన నివాస సదుపాయాన్ని కల్పించడానికి కూడా చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వర్తిస్తున్న ఐఏఎస్ అధికారిని పి.అముదను, ఆమె బృందాన్ని సీఎం అభినందించారు. విద్యాభివృద్ధిలో ముందజలో ఉన్న రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి నూతన విద్యావిధానాన్ని ప్రకటించామని, అందులోని అంశాలను చూసి విద్యావేత్తలు మెచ్చుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, దామో అన్బరసన్, ఎం. సుబ్రమణ్యం, ఎంపీలు టీఆర్ బాలు, జీ సెల్వం, శాసనసభ్యులు ఇ.కరుణానిధి, ఎస్ఆర్ రాజా, అరవింద్ రమేష్, వరలక్ష్మి, ఎస్ఎస్ బాలాజీ, ఎంఎం బాబు, రెవెన్యూ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి. అముద, వైద్య ప్రజారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ డి.స్నేహ, తాంబరం కార్పొరేషన్ మేయర్ కే వసంత కుమారి, కమిసనర్ ఎస్.బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కాపు సేవా సమితి

తొమ్మిదో వార్షికోత్సవం

- పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్యారీస్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలతో కాపు, తెలగ, బలిజలు ఐక్యంగా ముందుకు సాగుదామని గూడపాటి జగన్మోహన్ రావు అభిప్రాయపడ్డారు. స్థానిక టి.నగర్‌లోని ఆంధ్రా అండ్ సోషల్ కల్చరల్ అసోసియేషన్ గోదావరి హాలులో చెన్నై కాపు సేవా సమితి 9వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. సమితి అధ్యక్షులు గూడపాటి జగన్మోహన్ రావు స్వాగతోపన్యాసం చేస్తూ నగరం, శివారు ప్రాంతాల్లో ఉన్న సమితి సభ్యుల మధ్య పరిచయాలు పెరిగేలా 'కలిసి ఉందాం-కలిసి పోదాం' అని పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు, కాపు సేవా సమితి చైర్మెన్, ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన హరహర వీరమల్లు చిత్రం ఇండియన్ హిస్టరీ అని, ఇది ఐదేళ్ళ శ్రమకు దక్కిన ఫలితమన్నారు. పవన్‌కల్యాణ్ అందించిన సహకారం, పంచిన ఆప్యాయత మరువలేనిదని కొనియాడారు. ముఖ్యఅతిథిగా గుంటూరుకు చెందిన తులసీ సీడ్స్ చైర్మెన్ తులసీ రామచంద్ర ప్రభు, గౌరవ అతిథులుగా మధురవాయిల్‌లోని రవీనా హెల్త్ కేర్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఎ.శ్రీనివాస్, హెచ్‌సీఎల్-టెక్ చెన్నై వైస్ ప్రెసిడెంట్ రవీంద్ర పినిశెట్టి పాల్గొని కాపు సేవా సమితి సేవలను ప్రశంసించారు. ముందుగా సమితి కార్యదర్శి పీఆర్ కేశవులు వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా అతిథులు కాపు సేవా సమితి డైరక్టరీ-2025 ఆవిష్కరించారు. కల్చరల్ కార్యదర్శి బీఆర్ భాస్కర్‌రావు, సురేష్‌కుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.



నిర్మాత ఏఎం రత్నంను సత్కరిస్తున్న గూడపాటి జగన్మోహన్ రావు, పీఆర్ కేశవులు

అలరించిన హరికథాగానం...

ఎస్వీ సంగీత నృత్య కళాశాల హరికథ, భక్తి సంగీతం లెక్చరర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు భాగవతార్ బృందం చేసిన హరికథాగానం అలరించింది. వైవిధ్య భరితమైన భక్తి గీతాలతో కూడిన హరికథకు మురళి (కీబోర్డు), వేదశర్మ (తబలా) వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అతిథులు, కళాకారులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సమితి నవ వార్షికోత్సవం సందర్భంగా స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్

అధికారంలోకి వచ్చేది అన్నాడీఎంకేనే

- మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. సేలం జిల్లా ఓమలూరులో శనివారం ఉదయం కొంగునాడు మక్కల్ దేశియ కట్చితో పాటు వివిధ పార్టీల నాయకులు ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఈపీఎస్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2011 నుండి 2021 వరకు సేలం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన విషయం అందరికీ తెలుసని, భూగర్భ జలాలు వృధా చేయకుండా పంటలు బాగా పండి రైతులకు మంచి ఆదాయం వచ్చిందన్నారు. కుడిమరత్తు పథకం కింద నీటి వనరుల్లో పూడిక తీయించి వర్షాకాలంలో నీటిని నిల్వ చేసి వేసవిలో ప్రజల దాహార్తి తీర్చామని, తమ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చెరువుల్లో తోడుతున్న మట్టిని సహజ ఎరువుగా తయారుచేసి పంట పొలాల్లో చల్లుతున్నట్లు ఈపీఎస్ తెలిపారు. 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం పరిశ్రమల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం కారణంగా కుల వృత్తుల వారు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆరోపించారు. పార్టీకి ద్రోహం చేసిన శశికళ, ఓ.పన్నీర్‌సెల్వంలను మళ్ళీ పార్టీలోకి చేర్చుకునే ప్రసక్తే లేదని, అలాగే రాష్ట్ర ప్రజలు దైవంగా భావిస్తున్న దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితలను విమర్శించినవారు రాజకీయాల్లో కనిపించకుండా పోతారని ఈపీఎస్ పేర్కొన్నారు.



వేదికపై ప్రసంగిస్తున్న అన్బుమణి... పక్కనే రాందాస్ కోసం ఏర్పాటు చేసిన కుర్చీ

అన్బుమణికే పగ్గాలు

- సర్వసభ్యమండలిలో తీర్మానం
- వ్యవస్థాపకుడి కోసం వేదికపై ప్రత్యేక కుర్చీ

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): 'పాట్టాలి మక్కల్ కట్చి' (పీఎంకే) వ్యవస్థాపకుడు కాదు కుదరదన్నా.. ఆ పార్టీ సర్వసభ్యమండలి సమావేశం మాత్రం యువనేత అన్బుమణికే పగ్గాలు అప్పగించింది. నిబంధనల ప్రకారం వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఆయనే అధ్యక్షుడిగా కొనసాగాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో శనివారం జరిగిన ఆ పార్టీ సర్వసభ్యమండలి సమావేశం నిర్ణయించింది. వచ్చే యేడాది శాసనసభ ఎన్నికలు జరుగనుండటంతో పార్టీ సంస్థాగత ఎన్నికలను వచ్చే యేడాది ఆగస్టులోనే జరపాలని, అంతవరకూ పార్టీ అధ్యక్షుడిగా అన్బుమణినే కొనసాగించాలని ఈ సమావేశంలో ఓ తీర్మానం చేసి ఆమోదించారు. ఇదేవిధంగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వడివేల్ రావణన్, కోశాధికారిగా తిలక్‌భామ కూడా ఆ పదవుల్లో వచ్చే యేడాది ఆగస్టు వరకు కొనసాగుతారని తీర్మానించారు. వన్నియర్లకు రిజర్వేషన్ అమలు చేయకపోతే జైల్ భరో ఉద్యమాలు జరపాలని, రాష్ట్రంలో కులాలవారీ జనగణన నిర్వహించాలని, సామాజిక న్యాయం పాటించని బీసీ సంక్షేమ శాఖ తీరును ఖండిస్తూ తీర్మానాలు చేశారు. రాష్ట్ర హక్కుల సాధన దిశగా పార్టీ అధ్యక్షుడు అన్బుమణి చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ మరో తీర్మానం ప్రతిపాదించారు. ఈ సమావేశంలో మొత్తం 19 తీర్మానాలు ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

మెగా కూటమి ఏర్పాటు...

ఈ సమావేశంలో అన్బుమణి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపడటమే తమ ధ్యేయమని, ఆ దిశగానే మెగా కూటమిని ఏర్పాటు చేసుకుని ఎన్నికల బరిలో దిగుతామన్నారు. వచ్చే ఆరుమాసాల పాటు పార్టీ శ్రేణులు చాలా శ్రమించాల్సి ఉంటుందని, అసెంబ్లీ ఎన్నికల్లో పీఎంకే 40 సీట్లు గెలుచుకుంటే చాలని, అధికారం చెలాయించగలమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో సర్వసభ్యమండలికే సర్వహక్కులున్నాయని చెప్పారు. ఇక పార్టీ శ్రేణులందరికీ పార్టీ వ్యవస్థాపకుడు రాందాసే మార్గదర్శి అని పేర్కొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

రాందాస్ కోసం ఓ సీటు ...!

పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ ఆశయాలను నెరవేర్చటమే తన కర్తవ్యమని, ఆయనే తమ దైవం అని ప్రకటించిన అన్బుమణి.. ఆయన సర్వసభ్యమండలి సమావేశానికి రాకపోయినా పార్టీ శ్రేణులందరి హృదయాల్లోనూ సుస్థిరంగా ఉన్నారని తెలిపారు. అంతేగాక తన పక్కనే ఓ కుర్చీ కూడా వేసివుంచారు. రాందాసే పార్టీకి శాశ్వత వ్యవస్థాపకుడని, ఆయన కోసం ఎప్పుడూ కుర్చీ వేసి వుంచుతామని కూడా అన్నారు. రాందాస్ తప్పకుండా తమ వద్దకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాందాస్ తమకు దైవసమానుడని అన్బుమణి చెబుతూ దేవుళ్లకు కొన్ని సమయాల్లో కోపం వస్తుందని, వారిని శాంతింపజేయడానికి కొన్ని ఉత్సవాలు జరిపితే సరిపోతుందని, అయితే ఈ విషయంలో పూజారులకే సమస్యలు ఎదురవుతాయని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

ఇలా గణేశన్‌కు

స్వల్ప శస్త్రచికిత్స



ఇలా గణేశన్

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేశన్‌కు వైద్యులు స్వల్ప శస్త్రచికిత్స నిర్వహించారు. వారం రోజులుగా బ్లడ్‌షుగర్ పెరిగి స్వల్పంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇలా గణేశన్ టి.నగర్‌లోని నివాసంలో శుక్రవారం ఉదయం కాలుజారి పడ్డారు. తలకు బలమైన గాయాలు తగలటంతో కుటుంబీకులు ఆయన్ని వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యులు ఆయనకు చికిత్సలందించారు. ఈ నేపథ్యంలో ఆయన తలపై ఏర్పడిన గాయాన్ని స్కానింగ్ చేయగా లోపలి వైపు గాయం అధికంగా ఉండటాన్ని గమనించారు. ఆ తర్వాత తలలో చిన్నపాటి శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం అత్యవసర చికిత్సా విభాగంలో ఉన్న ఇలా గణేశన్ ఆరోగ్యం శస్త్రచికిత్స తర్వాత కుదుట పడిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

బాణసంచా పేలుడు

- ఇద్దరు మహిళలు సహా ముగ్గురి దుర్మరణం

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వెంబకోట సమీపంలో చట్ట వ్యతిరేకంగా బాణసంచా తయారు చేస్తున్న ఓ ఇంటిలో శనివారం ఉదయం పేలుడు సంభవించి ఇద్దరు మహిళల సహా ముగ్గురు దుర్మరణం చెందారు. వెంబకోట సమీపంలో విజయకరిసలంకుళం తూర్పువీధిలో నివసిస్తున్న పొన్నుపాండియన్ ఇంటిలో గత కొంత కాలంగా ఐదారుగురు కార్మికులు బాణసంచా తయారు చేస్తున్నారు. శనివారం ఉదయం కార్మికులు బాణ సంచా తయారు చేస్తుండగా విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు టపాసులపై పడ్డాయి. దీంతో గదుల్లో మందుగుండు సామగ్రికి నిప్పంటుకుని పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తున్న కీళ్‌కోద్దై ప్రాంతానికి చెందిన జగదీశ్వరన్ (18), విజయకరిసలంకుళంకు చెందిన ముత్తులక్ష్మి (70), షణ్ముగత్తాయ్ (60) సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా మారియమ్మాళ్ (55) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సంభవించగానే గదులలో పనిచేస్తున్న కార్మికులంతా ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకుని వెంబకోట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్ళి మంటలను ఆర్పివేశారు. వెంబకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలన పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే పారిపోయిన ఇంటి యజమాని పొన్నుపాండియన్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



పేలుడులో ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది. వీధిలో గుమికూడిన స్థానికులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలో కారు- బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. లాల్‌గుడి నగర్‌కు చెందిన సంతోష్‌ను ఉద్యోగం కోసం విదేశాలకు పంపేందుకు అతని స్నేహితులు 8 మంది కారులో శనివారం ఉదయం బయల్దేరారు. పోదుమాందురై ప్రాంతంలో వస్తున్న కారును ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న విశ్వనాథన్ (56), కారులో ప్రయాణిస్తున్న అరవింద్ (20), సాధిక్ భాషా (19) అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాల నుంచి ఐదుగురు క్షతగాత్రులను వెలికితీసి ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం దిగ్భ్రాంతి..: తిరుచ్చి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపడంతో పాటు తలా రూ.3 లక్షలు, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి తలా రూ. లక్ష, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేలు అందజేయనున్నట్లు సీఎం తెలిపారని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా బీసెంట్ నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. 7వ అవెన్యూ, రుక్మిణీ రోడ్డు, టైగర్ వరదాచారి రోడ్డు, గంగై వీధి, అరుణాటెల్ బీచ్ రోడ్డు, బీచ్ రోడ్డు, అన్నా కాలని తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

18 నుంచి 'గోల్డ్ అప్రయిజర్' శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు 'గోల్డ్ అప్రయిజర్' శిక్షణ అందించనుంది. బంగారంలో రకాలు, విలువ కట్టడం, నాణ్యత నిర్ధారణ, నగలపై రుణాలు అందించే విధానం, హాల్ మార్క్ సహా పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 9543773337, 9360221280 అనే నెంబర్లను (సోమ-శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు) సంప్రదించాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

డీఎంకే లిటరరీ వింగ్ చీఫ్‌గా అన్వర్ రాజా

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ మంత్రి ఎ.అన్వర్‌రాజా ఇటీవల డీఎంకేలో చేరారు. ప్రస్తుతం ఆయనకు డీఎంకే లిటరరీ వింగ్ చీఫ్‌గా నియమించారు. ఇప్పటివరకు కవి ఇంద్రకుమారి ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఆమెకు బదులు అన్వర్‌రాజాను నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ప్రకటన విడుదల చేశారు.

పాడి రైతులకు రూ.128 కోట్ల ప్రోత్సాహం

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పాడి ఆవుల పెంపకాన్ని ప్రోత్సహించేలా, ఆవిన్ సంస్థకు పాలు సరఫరా చేసే రైతులకు లీటరుకు రూ.3 ప్రోత్సాహక భత్యం అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, ఈ ఏడాది మార్చి వరకు 3.80 లక్షల మందికి రూ.407 కోట్లు అందజేశారు. అలాగే, ఏప్రిల్ నుంచి జూన్ వరకు రైతులకు చెల్లించేందుకు రూ.128 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి మనోతంగరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

భూటాన్‌లో నర్సులుగా ఉద్యోగావకాశాలు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భూటాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు రెండేళ్ల అనుభవం కలిగి బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులైన 23 నుంచి 45 ఏళ్లలోపున్న మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2 నుంచి ఐదేళ్ల పని అనుభవం ఉన్న వారికి రూ.65,000, 6 నుంచి 10 ఏళ్ల అనుభవం కలిగిన వారికి రూ.73,000, పదేళ్ల పైబడి అనుభవం ఉన్న వారికి రూ.86,000 వేతనంగా అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://forms.gle/JS2b341tf2tcpJn56 అనే లింక్‌లో స్వీయ వివరాలు పూర్తిచేసి, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను ఈ నెల 18వ తేదీలోపు పంపించవచ్చు. వివరాలకు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్, 6379179200, 044-22502267 అనే నెంబర్లను సంప్రదించవచ్చు.

4 నెలల్లో సోనాలికా రికార్డు స్థాయి విక్రయాలు

అడయార్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ట్రాక్టర్ల తయారీలో అగ్రగామిగా నిలిచిన సోనాలికా కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో రికార్డు స్థాయిలో అమ్మకాలు సాధించింది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో ఏకంగా 53,772 ట్రాక్టర్లను విక్రయించినట్టు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇది కంపెనీ వృద్ధి, నూతన ఆవిష్కరణలకు బలమైన పునాదిగా భావిస్తున్నట్టు తెలిపింది. అత్యాధునిక వ్యవసాయ యంత్రసామగ్రిని దేశ రైతంగానికి అందించడం ద్వారా వ్యవసాయంలో నాణ్యమైన పంట పొందేందుకు సోనాలికా ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంది. రోబోటిక్ టెక్నాలజీతో ట్రాక్టర్ ప్లాంట్‌లో అతి తక్కువ సమయంలోనే హెవీ డ్యూటీ ట్రాక్టర్ తయారు చేయగలదని సోనాలికా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల కమిషన్ జాబితా నుంచి 22 పార్టీల తొలగింపు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019 నుంచి ఎన్నికల్లో పోటీచేయని 22 రాజకీయ పార్టీల పేర్లను ఎన్నికల కమిషన్‌లో నమోదుచేసిన పార్టీల జాబితా నుంచి తొలగించారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ 30 రోజుల్లో అప్పీలు చేసుకోవచ్చని ఎన్నికల కమిషన్ ప్రకటన విడుదల చేసింది.

రేపు సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య 19 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు మార్గంలోని పొన్నేరి-కవరపేట మధ్య రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా సోమవారం 19 సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.30, 11.35 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 1, 2.30, 3.15 గంటలకు సెంట్రల్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- సెంట్రల్ నుంచి ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైళ్లు, సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 1.15, 3.15, రాత్రి 9 గంటలకు చెన్నై వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40 గంటలకు గుమ్మిడిపూండికి వెళ్లే, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 10.55 గంటలకు చెన్నై బీచ్‌కి వెళ్లే సబర్బన్ రైలు రద్దు.
- సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు నెల్లూరు వెళ్లే మెము, నెల్లూరు నుంచి సాయంత్రం 6.45 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే మెము, సెంట్రల్ నుంచి రాత్రి 11.40 గంటలకు ఆవడి వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- ప్రయాణికుల సౌకర్యార్థం సెంట్రల్-పొన్నేరి ఉదయం 10.30, పొన్నేరి-సెంట్రల్ మధ్యాహ్నం 1.18, 3.33, చెన్నై బీచ్-పొన్నేరి మధ్యాహ్నం 12.40, సెంట్రల్-మీంజూరు ఉదయం 11.35, మీంజూరు-సెంట్రల్ మధ్యాహ్నం 2.59 గంటలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

పొంగల్ లోగా 110 కొత్త లగ్జరీ బస్సులు

- తమిళనాడు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్


ప్రారంభంకానున్న నూతన ఏసీ బస్సులు

ప్యారీస్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పొంగల్ లోగా 110 కొత్త లగ్జరీ బస్సు సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు టీఎన్ఎస్‌టీసీ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. టీఎన్ఎస్‌టీసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజు 1,080కు పైగా బస్సులు నడుపుతున్న నేపథ్యంలో, లక్ష మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో ప్రభుత్వ రవాణా సంస్థలకు 4,300 కొత్త బస్సులను మూడు విడతలుగా కొనుగోలు చేస్తున్నారు. తొలి విడతగా కొనుగోలు చేసిన 1,500లకు పైగా బస్సులను చెన్నై, మదురై, తిరుచ్చి, కోవై, కుంభకోణం తదితర ప్రాంతాల్లో నడుపుతున్నారు. ఇదిలా వుండగా మరో పది రోజుల్లో 10 ఏసీ బస్సులను నడపనున్నట్లు తెలిపిన టీఎన్ఎస్‌టీసీ పొంగల్ పండుగలోపు స్లీపర్, చైర్ సదుపాయంతో కూడిన 110 కొత్త లగ్జరీ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది.

ఆగని లంక నావికాదళ దాడులు

- 8 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి సమీపంలో చేపలు పడుతున్నారంటూ రామేశ్వరానికి చెందిన ఎనిమిదిమంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. రెండు రోజుల క్రితం మరపడవలో వెళ్ళిన జాలర్లు శనివారం వేకువజాము కచ్చాదీవి వద్ద చేపలుపడుతుండగా ఆ ప్రాంతానికి వచ్చిన శ్రీలంక నావికాదళం తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా చొరబడ్డారంటూ వారిపై దాడికి దిగారు. ఆ తర్వాత ఎనిమిది జాల్లరను అరెస్టు చేసి, వారి పడవ కూడా స్వాధీనం చేసుకుని శ్రీలంకలోని కాంగేశన్ రేవుకు తరలించారు. రెండు రోజుల క్రితమే ముఖ్యమంత్రి స్టాలిన్ శ్రీలంక చెరలో ఉన్న జాలర్లను విడిపించాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు లేఖ రాసిన నేపథ్యంలో మళ్ళీ శ్రీలంక నావికాదళం జాలర్లను అక్రమంగా నిర్బంధించడం పట్ల రామేశ్వరం, పాంబన్ జాలర్ల సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ వంద వీధి కుక్కలకు రేబిస్ టీకాలు

- మేయర్ ప్రియ


మనలిలో వీధి కుక్కల టీకా శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్, జీసీసీ అధికారులు

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి కుక్కల బారి నుండి ప్రజలను కాపాడేందుకు ఆ కుక్కలకు రాబిస్ నిరోధక టీకాలు వేయాలని నిర్ణయించామని, ఆ మేరకు ప్రతిరోజూ వంద కుక్కలకు టీకాలు వేయనున్నామని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తెలిపారు. మనలి జోన్ మాత్తూర్ ఎంఎండీఏ పార్కులో వీధి కుక్కల టీకా శిబిరాన్ని శనివారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి కుక్కల కారణంగా నగరవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఫిర్యాదులు రావటంతో శునకాలకు టీకాలు వేసే శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రోజు వంద శునకాల చొప్పున టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రెండు నెలల్లోగా నగరమంతటా ఈ కార్యక్రమాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు.

- పరువు హత్యకేసు

సిట్ విచారణ కోరుతూ డీపీఐ ధర్నా


పరువు హత్యలను ఖండిస్తూ నినాదాలు చేస్తున్న డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో ఐటీ ఉద్యోగి కవిన్ పరువు హత్యకేసుపై సిట్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ డీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ధర్నా జరిగింది. సైదాపేట పానగల్ మాళిగై వద్ద జరిగిన ఈ ధర్నాకు డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ నాయకత్వం వహించారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లా శాఖల నేతలు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమావళవన్ ప్రసంగిస్తూ రాష్ట్రంలో పరువు హత్యలు ఎక్కువవుతున్నాయని, వీటిని నిరోధించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, సీపీఐ, సీపీఎం నాయకులతో పాటు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసినప్పుడు తాను డిమాండ్ చేశానని తెలిపారు. కవిన్ హత్యలో అతడి ప్రియురాలి తల్లిదండ్రులు పోలీసు శాఖలో పనిచేస్తున్నందున ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపితేనే వాస్తవాలు వెల్లడై అసలైన దోషులకు కఠిన శిక్ష పడగలదని ఆయన పేర్కొన్నారు. ధర్నాలో డీపీఐ డిప్యూటీ కార్యదర్శులు వన్నియరసు, ఎళ్ కరోలిన్, తగటూరు తమిళ్‌సెల్వన్, గౌతమ్‌సన్నా, రజినీకాంత్, న్యాయవాది పార్వేందన్ తదితరులు పాల్గొన్నారు.

సహజ సిద్ధమైన పదార్థాలతో

వినాయకుడి ప్రతిమలు

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచన


సిద్ధమవుతున్న వినాయక ప్రతిమలు

ప్యారీస్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించకుండా లంబోధరుడి ప్రతిమలను సహజ సిద్ధమైన వనరులతో మాత్రమే తయారు చేయాలని తమిళనాడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) సూచించింది. ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ప్రారంభకానున్న సందర్భంగా హిందూ సంస్థలు పందిళ్లలో గణపయ్య విగ్రహాలుంచి ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, విఘ్నేశ్వరుడి ప్రతిమల తయారీలో రసాయన మిశ్రమాలతో కూడిన ప్లాస్టర్ ప్యారిస్ వినియోగించకుండా బంకమట్టి, కాగితం గుజ్జు, మిఠాయిలు, పండ్లు, కూరగాయలతో తయారుచేసుకోవాలని పీసీబీ అధికారులు తెలిపారు. సముద్రం, నదులు, చెరువులు, వాగులు తదితరాల్లో జిల్లా యంత్రాంగం అనుమతించిన ప్రాంతాల్లో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలని తెలిపారు. తయారు చేసిన విగ్రహాలకు ఉపయోగించే పెయింటింగ్‌లో రసాయనాలు లేకుండా చూసుకోవాలని, నీటిలో సులువుగా కరిగిపోయేలా విగ్రహాలు తయారుచేసి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిందిగా అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

పళని ఆలయంలో జపాన్ భక్తుల పూజలు


జపాన్ భక్తుడికి శూలాయుధం అందజేస్తున్న శివానంద పులిప్పాణి పాత్తిరస్వామి, క్షీర కలశాలతో వెళ్తున్న జపాన్ యువతులు

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని సుప్రసిద్ధ పళని దండాయుధపాణి స్వామివారి ఆలయంలో శనివారం ఉదయం జపాన్ దేశానికి చెందిన వంద మంది భక్తులు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. జపాన్‌కు చెందిన మహిళలు క్షీరకలశాలతో ఆలయం వరకూ పాదయాత్ర చేశారు. పళని పర్వతాలయం దిగువనున్న బోగర్ సిద్ధపురుషుడి శిష్యుడైన పులిప్పాణి సిద్ధపురుషుడు జీవసమాధి ప్రాంతం నుంచి శనివారం ఉదయం శివానంద పులిప్పాణి పాత్తిరస్వామి నేతృత్వంలో పారిశ్రామికవేత్త గోపాల్ పిళ్లై సుబ్రమణ్యం సమక్షంలో జపాన్ దేశానికి చెందిన భక్తులు తమిళ సంప్రదాయ పద్ధతిలో ధోవతి చొక్కా ధరించి మంగళవాయిద్యాల నడుమ తిరుఆవినన్‌కుడి కుళందై వేలప్పర్ ఆలయానికి క్షీర కలశాలను మోసుకెళ్ళారు. అక్కడ మురుగప్పెరుమాన్‌కు క్షీరాభిషేకం జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పళని పర్వతాలయానికి మెట్ల మార్గం గుండా నడిచి వెళ్ళి దైవదర్శనం చేసుకున్నారు.

తిరుత్తణి ఆడి కృత్తిక ఏర్పాట్ల పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా

తిరుత్తణి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆగస్టు 14న ప్రారంభంకానున్న ఆడి కృత్తిక ఉత్సవాల ఏర్పాట్లను ఎస్పీ వివేకానంద శుక్లా శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు కొండకు కావళ్లతో వస్తారని, ఈ క్రమంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సౌకర్యాలు కల్పించాలని, అదే విధంగా ఆలయ ప్రాంగణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు, తాగునీరు తదితర వసతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కమిటీ చైర్మెన్ శ్రీధరన్, ఆలయ కమిషనర్ రమణి, రెవెన్యూ డివిజనల్ కమిషనర్ కనిమొళి సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రధానికి నయినార్ నాగేంద్రన్ కృతజ్ఞతలు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి-మరక్కాణం మధ్య రూ.2,157 కోట్లతో నాలుగు లేన్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఈ ప్రాజెక్ట్‌తో తమిళనాడు-పుదుచ్చేరి మధ్య రవాణా వ్యవస్థ మెరుగుపడడంతో పాటు 8 లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో 10 లక్షల మంది పరోక్షంగా ఉద్యోగాలు లభించే అవకాశముందన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో ఇరు రాష్ట్రాల సామాజిక-ఆర్థిక పరిస్థితులు మెరుగవుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

శరవేగంగా తిరువళ్లూరు - తిరునింద్రవూరు ఫోర్‌వే పనులు

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు నుండి తిరునింద్రవూరు వరకు జాతీయ రహదారిని నలుగు లేన్లగాగా మార్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఫోర్‌వే అందుబాటులోకి వస్తే బస్సులో చెన్నై నుంచి తిరుపతి వెళ్లేందుకు ముప్పావు గంట ఆదా అవుతుందని హైవే అధికారులు తెలిపారు. చెన్నై - తిరుపతి హైవే (ఎన్‌హెచ్ 716) నగర శివారు ప్రాంతమైన పాడి నుంచి ప్రారంభమవుతుంది. పాడి నుండి తిరునింద్రవూరు వరకు ఫోర్‌వే రోడ్డు ఉంది. ఆ తర్వాత తిరునింద్రవూరు నుండి తిరువళ్లూరు వరకు ఉన్న రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించే నిమిత్తం రూ.304 కోట్లతో తిరువళ్లూరు - తిరునింద్రవూరు మధ్య 18 కిలోమీటర్ల రహదారిని ఫోర్‌వేగా మార్చే పనులు గత కొద్ది నెలలుగా జరుగుతున్నాయి. ఈ రహదారిలో తలంగాచేరి, తన్నీర్‌కుళం, తిరునింద్రవూరు సహా ఏడు ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు కూడా నిర్మించారు. అంతేకాకుండా రహదారుల పక్కగా ఇనుప కంచె కూడా ఏర్పాటు చేస్తున్నారు. తిరుత్తణి, తిరుపతి, తిరువళ్లూరు, వేప్పంపట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు సర్వీసు రోడ్లు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ఫోర్‌వే ప్రారంభమవుతుందని హైవే అధికారులు పేర్కొన్నారు.

నేడు వైద్యబృందంతో మహానాడుకు రాందాస్

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా పుంపుహార్‌లో ఆదివారం జరగనున్న వన్నియర్ సంఘం మహానాడులో పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ పాల్గొననున్నారు. ఆయనకు అత్యవసర వైద్యం అందించేందుకు అంబులెన్స్‌తో పాటు ఒక అపోలో వైద్యుడు, ఒక నర్సుతో కూడిన వైద్య బృందం వెళ్లనుంది. ఐసీయూ సౌకర్యం కలిగిన అంబులెన్స్, విల్లుపురం జిల్లా తైలాపురంలోని రాందాస్ ఇంటి ప్రాంగణంలో సిద్ధం చేశారు.

ఫొటోలు లీక్ చేస్తానని బెదిరింపు

- యువకుడి అరెస్టు

తిరుత్తణి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తనకు డబ్బు ఇవ్వకుంటే తనతో సన్నిహితంగా దిగిన ఫొటోలను లీక్ చేస్తానని బెదిరించి ఓ యువతిపై యువకుడు దాడికి పాల్పడిన ఘటన తిరువళ్లూరు జిల్లాలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ప్రవీణ్ అనే వ్యక్తి, ఓ యువతి కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రవీణ్‌కు అంతకు ముందే వేరే మహిళతో వివాహమైనటు తెలిసి ఆ యువతి అతనితో విడిపోయింది. ఇదిలా వుండగా, శుక్రవారం రాత్రి ఆ యువతి ఇంటికి వెళ్లిన ప్రవీణ్ ఇంట్లోని నగదు, నగలు తనకివ్వాలని, లేకుంటే తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు బయటపెడతానని బెదిరించి దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ యువతి పెద్దగా కేకలు వేయడంతో ఇరుగురుపొరుగు వారు అక్కడికి రావడంతో ప్రవీణ్ పరారయ్యాడు. ఈ విషయంపై కనకమ్మసత్రం పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేయగా, పోలీసులు ప్రవీణ్‌ను శనివారం అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వినాయక ఆలయం.. ఇక శీతలం

- ఏసీ యూనిట్ ప్రారంభించిన సీఎం రంగస్వామి



పుదుచ్చేరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రసిద్ధిచెందిన మనకుల వినాయక ఆలయం లో పూర్తిగా ఏసీ సౌకర్యం ఏర్పాటుచేశారు. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన పుదుచ్చేరి ప్రధాన ఆలయాల్లో మనకుల వినాయకుడి ఆలయం ఒకటి. బీచ్ సమీపంలో ఉన్న ఈ ఆలయాన్ని ప్రతిరోజూ వందల సంఖ్య లో భక్తులు సందర్శిస్తుంటారు. భక్తుల అభ్యర్థన మేరకు మనకుల వినాయక దేవస్థానం, ఆలయంలో రూ.33 లక్షలతో ఎయిర్ కండిషన్ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రజలు, దాతల నుంచి విరాళాలు సేకరించింది. ఏసీ సదుపాయంతో ఏర్పాటైన ఆలయాన్ని శుక్రవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణన్, ఎమ్మెల్యే రమేష్, శివాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయం: మహిళపై గూండా చట్టం

అడయార్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగయూరులో గంజాయి విక్రయించిన మహిళపై పోలీసుల గూండా చట్టం ప్రయోగించారు. గత నెల 24న కొడుంగయూరు, ఎరుకాంజేరి ఇందిరా నగర్‌లోని ఓ ఇంటిలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ధారణి (27), వినోదిని (29) అనే ఇద్దరు మహిళల సహా శరవణన్ అనే రౌడీని కూడా అరెస్టు చేశారు. వీరి నుంచి గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ధారణిపై ఇప్పటికే 13 కేసులు న్నాయి. దీంతో ఆమెపై పోలీసులు గూండా చట్టాన్ని ప్రయోగించారు. గత మూడేళ్ళలో ఆమె రెండు సార్లు గూండా చట్టం కింద అరెస్టయి విడుదలకావడం గమనార్హం.

ఎంటీసీ బస్సు డ్రైవర్ చైన్ చోరీ

అడయార్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంటీసీ బస్సు డ్రైవరును కత్తితో బెదిరించి బంగారు గొలుసు దోపిడీ చేసిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. విల్లుపురం జిల్లాకు చెందిన అరుణ్ ఎంటీసీ బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు అన్నా నగర్ డిపో వద్ద నడిచి వెళుతుండగా, ముగ్గురు వ్యక్తులు అడ్డగించి కత్తితో బెదిరించి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... ఈ చోరీకి పాల్పడింది మాంగాడుకు చెందిన ఈశ్వర్‌గా గుర్తించి అరెస్టు చేశాడు. ఈ యువకుడు మాంగాడు, పూందమల్లి, కొడుంగయూరు, పెరంబూరు తదితర ప్రాంతాల్లో 15కు పైగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్టు పోలీసులు విచారణలో వెల్లడైంది. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

డీఎంకే నేత ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి

అడయార్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా విళుదూరు గ్రామంలో డీఎంకే ఐటీ విభాగం నేత గౌతమన్ (35) ఇంటిపై కొందరు వ్యక్తులు శనివారం తెల్లవారుజామున పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. ఈ దాడిలో ఇంటి ఆవరణలో వున్న వాహనాలతో పాటు ఇంటి తలుపులు కాలిపోయాయి. ఈ నెల 5వ తేదీ ఆలయ వార్షిక వేడుకల్లో జరిగిన గొడవ కారణంగా ప్రత్యర్థి వర్గానికి చెందిన ప్రభు, అలెక్స్, షణ్ముగం, రంజిత్‌తో సహా ఐదుగురు ఈ దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అద్దెకు కార్లు, ద్విచక్రవాహనాలు

- యజమానులకు రూ.1.18 లక్షల జరిమానా

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కోవైలో 'బైక్ టాక్సీ', అద్దెకు వినియోగిస్తున్న సొంత కార్లను మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కోవైలో టాక్సీ డ్రైవర్లు, యజమానుల ఫిర్యాదు మేరకు కోవై సర్కిల్ జాయింట్ ట్రాఫిక్ కమిషనర్ ఎస్.అళగరసు ఆదేశాలతో, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు శనివారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సొంతంగా వాడాల్సిన ఆరు కార్లు, 12 ద్విచక్రవాహనాలను 'రాపిడో' యాప్ ద్వారా అద్దెకు నడుపుతున్నట్లు గుర్తించారు. మోటారు వాహన చట్టం 1988 నిబంధనలు అతిక్రమించారంటూ, వాహనాల యజమానులకు రూ.1.8 లక్షల జరిమానా విధించినట్లు కోవై ట్రాఫిక్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

స్పీకర్ బాక్స్ మీదపడి బాలిక మృతి

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిలా పరమకుడిలో ఆలయ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయం ముందు భారీ స్పీకర్ బాక్స్‌లు ఏర్పాటుచేశారు. శనివారం ఉదయం తల్లిదండ్రులతో పాటు ఉత్సవాలకు వచ్చిన సుగంధి (6) అనే బాలిక స్పీకర్ బాక్స్‌లకు కట్టిన వైరు లాగడంతో స్పీకర్ బాక్స్ ఆమెపై పడి ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుత్తణి పుష్కరిణిలో తగ్గిన నీరు


పుష్కరిణిలో తక్కువగా ఉన్న నీరు

తిరుత్తణి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ పుష్కరిణిలో నీరు తక్కువగా ఉండటంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. ఈ నెల 16వ తేదీ ఆడి కృత్తిక ఉత్సవాల్లో భాగంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. దీని కోసం రెండు నెలల క్రితం సుమారు రూ.25 లక్షలతో పుష్కరిణిలో పూడిక తీయించి శుభ్రం చేయించారు. అనంతరం తెప్పోత్సవానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకోసం శుక్రవారం తెప్పల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో, కోనేటిలో నీరు తగ్గివుండటాన్ని గమనించిన భక్తులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. తెప్పోత్సవానికి ఆరురోజులే ఉండటంతో ఆలయ నిర్వాహకులు సందిగ్ధంలో పడ్డారు.

సహసార యోగా సెంటర్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వెల్నెస్ విజనరీగా గుర్తింపు పొందిన డాక్టర్ వాణి జయరామన్ నగరంలో కొత్తగా సహసారా యోగా, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించారు. ఇందులో పురాతన పద్ధతులను ఆధునిక చికిత్సా శాస్త్రంతో ఏకం చేసేలా ఈ సెంటర్ ప్రారంభించారు. ఇందులో యోగా చికిత్స, ఇంటిగ్రేటివ్ థెరపీ వంటి చికిత్సలు అందిస్తారు. ఇంటిగ్రేటివ్ థెరపీ కింద టిబెటన్ సౌండ్ హీలింగ్, ఫుట్ రిఫ్లెక్సాలజీ, న్యూరోథెరపీ, సైకాలజీ, నేచురోపతి, యోగా వంటివి ఇక్కడ అందుబాటులో ఉంటాయని డాక్టర్ వాణి వెల్లడించారు. అన్నా నగర్‌లో ప్రారంభించిన ఈ వెల్‌నెస్ సెంటరులో ప్రతి సెషన్‌కు అనుభవజ్ఞులైన నిపుణులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఇందులో ప్రినేటల్ యోగా, న్యూరోథెరపీ, ఎనర్జీ హీలింగ్, సైకాలజీ, సౌండ్ థెరపీలో ఎంతో అనుభవం కలిగిన నిపుణులు ఉన్నారని వెల్లడించారు.

కెప్టెన్ కుమారుడిగా ఉండటమే ఇష్టం

● విజయ ప్రభాకరన్ ● 22న 'కెప్టెన్ ప్రభాకరన్' రీ రిలీజ్



ఆడియో రిలీజ్ దృశ్యం

తనకు ఎంపీ పదవి, డబ్బు కంటే దివంగత కెప్టెన్ విజయకాంత్ కుమారుడిగా ఉండడమే గౌరవంగా భావిస్తానని నటుడు విజయ ప్రభాకరన్ అన్నారు. విజయకాంత్ - రమ్యకృష్ణ జంటగా నటించిన 'కెప్టెన్ ప్రభాకరన్' 1991 ఏప్రిల్ 14వ తేదీ విడుదలై ఘన విజయం సాధించింది. ఈ మూవీని ఈ నెల 22వ తేదీ రీ రిలీజ్ చేస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని ఆ చిత్ర ఆడియో, ట్రైలర్‌ను శుక్రవారం నగరంలో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి చిత్ర దర్శకుడు ఆర్కే.సెల్వమణి, మాటల రచయిత లియాఖత్ అలీఖాన్, నటుడు మన్సూర్ అలీఖాన్, నటి రమ్యకృష్ణతో పాటు దర్శకులు ఎస్ఏ చంద్రశేఖర్, ఆర్‌వి ఉదయకుమార్, విక్రమన్, ఏఆర్ మురుగదాస్, పేరరసు, ఎళిల్, లింగుస్వామి, నిర్మాతలు కలైపులి ఎస్.థాను, విక్రమన్, అమ్మా క్రియేషన్స్ టి.శివ, ధనంజెయన్, లలిత్ కుమార్, నటులు రవి మరియా, సింగంపులి, ఇలవరసు తదితరులు హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఎస్.ఏ.చంద్రశేఖర్ మాట్లాడుతూ, 'మానవత్వానికి సరైన నిదర్శనం విజయకాంత్' అని కొనియాడారు. చిత్ర దర్శకుడు ఆర్కే.సెల్వమణి మాట్లాడుతూ, 'వందేళ్ళకు చేరాల్సిన పుణ్యఫలాలను విజయకాంత్ తన వారసులకు చేర్చిపెట్టి ప్రశాంతంగా వెళ్ళిపోయారన్నారు. నటి రమ్యకృష్ణ మాట్లాడుతూ, 'ఈ ఒక్క చిత్రం విజయంతో నాకు పదేళ్ళకు సరిపడా అవకాశాలు వచ్చాయి' అని పేర్కొన్నారు. విజయకాంత్ కుమారుడు, నటుడు విజయ ప్రభాకరన్ మాట్లాడుతూ, 'ఇది ఎవర్‌గ్రీన్ మూవీ. కెప్టెన్ వందో సినిమా. ఆయన భౌతికంగా దూరమైన తర్వాత రిలీజ్ చేస్తున్నాం. అందువల్ల ఇది ఆయన తొలి చిత్రంగా భావించి సెలెబ్రేట్ చేసుకోవాలి. కెప్టెన్ 156 చిత్రాల్లో నటించారు. ఇకపై అభిమానుల కోసం ప్రతి యేటా ఒక్కో చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తాం. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు కూడా ఇది పాఠంలా ఉంటుంది' అని పేర్కొన్నారు.



వేదికపై విలపిస్తున్న విజయ్ ప్రభాకరన్

డిఫరెంట్ క్రైం థ్రిల్లర్‌గా 'ఇంద్ర'

● దర్శకుడు శబరిస్ నంద

'తరమణి', 'రాఖీ' వంటి చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు, ఇమేజ్‌ను సొంతం చేసుకున్న హీరో వసంత్ రవి తాజాగా నటించిన 'ఇంద్ర' మూవీ డిఫరెంట్ క్రైమ్ థ్రిల్లర్ అని ఆ చిత్ర దర్శకుడు శబరిస్ నంద చెప్పారు. ఈ నెల 22న విడుదలకానున్న ఈ చిత్ర విశేషాలను హీరో వసంత్ రవి, సంగీత దర్శకుడు అజ్మల్ తహసీన్‌తో కలిసి శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు వివరిస్తూ, 'ఇది వైవిధ్యభరితమైన చిత్రం. వసంత్ రవి కెరీర్‌లోనే ఎంతో భిన్నంగా ఉంటుంది. పోలీస్ అధికారిగా వసంత్ రవి నటించారు. ప్రతి ఒక్కరిలోనూ 'ఈగో' అనేది ఉంటుంది. ఓ కేసు విచారణ సమయంలో హీరో చూపు పోతుంది. దీంతో పోలీస్ శాఖ సస్పెండ్ చేస్తుంది. అయినప్పటికీ ఆ కేసు విచారణ చేస్తుంటాడు. ఇది విలన్ ఈగోను హర్ట్ చేస్తుంది. ఆ తర్వాత హీరో, విలన్ మధ్య ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. ప్రతినాయకుడిగా టాలీవుడ్ హాస్యనటుడు సునీల్ పోషించారు. మెహ్రీన్ పిర్జాదా హీరోయిన్. ఈ సినిమాకు సంగీతం ఎంతో బలం. హీరో వసంత్ రవి మాట్లాడుతూ, "జైలర్‌లో పోలీస్ ఆఫీసర్‌గా నటించాను. ఇపుడు ఈ సినిమాలో ఫుల్‌లెంగ్త్ రోల్ పోషించాను. ఇప్పటివరకు పన్నెండు చిత్రాల్లో నటించాను. వాటన్నింటికంటే భిన్నమైన మూవీ 'ఇంద్ర'. హీరోయిన్‌తో లిప్‌లాక్ సన్నివేశం ఉంది. ఈ విషయాన్ని మెహ్రీన్‌కు ముందు చెప్పగానే అంగీకరించింది. 'కూలీ' మూవీకి పోటీ మాత్రం కాదు' అన్నారు.



'ఇంద్ర'లో వసంత్ రవి, మెహ్రీన్

హీరోగా డాక్టర్ కుమారుడు హీరోయిన్‌గా శేష్విత



నేవా, శేష్విత, తరుణ్ విజయ్

తిరువళ్లూరు జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ కార్తికేయన్ కుమారుడు తరుణ్ విజయ్ వెండితెరకు హీరోగా పరిచయమవుతున్నారు. డెబ్యూ డైరెక్టర్ నేవా ఆర్మ్‌స్ట్రాంగ్ దర్శకత్వంలో రూపొందిన 'కుట్రం పుదిదు' అనే చిత్రంలో కథానాయకుడిగా నటించారు. ఈ చిత్రం ద్వారా శేష్విత కనిమొళి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ మూవీ వివరాలను తరుణ్ విజయ్, నేవా, శేష్విత శుక్రవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దర్శకుడు నేవా మాట్లాడుతూ, 'ఇది ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ మూవీ. సీరియల్ కిల్లర్ చేసే నేరాలు ఎవరూ ఊహించని విధంగా ఉంటాయి. వాటిని పోలీసులు ఎలా కనిపెడతారన్నదే ఈ చిత్ర కథ. క్రైమ్ థ్రిల్లర్ అయినప్పటికీ తండ్రీ కుమార్తెల ప్రేమానుబంధాలు తెలిపే విధంగా రూపొందించాం. హీరో తరుణ్ విజయ్ మాట్లాడుతూ, 'నా పూర్తి పేరు తరుణ్. విజయ్ అంటే ఓ పవర్‌ఫుల్ నేమ్. అందుకే తరుణ్ విజయ్‌గా పెట్టుకున్నాం. మా ఇంటిలో అందరూ వైద్యులే. కానీ, నేను మాత్రం యాక్టర్ అయ్యాను. కుటుంబ సభ్యులు ఎంతగానో సపోర్టు చేశారన్నారు. హీరోయిన్ శేష్విత మాట్లాడుతూ, 'పరమశివన్ ఫాతిమా' మూవీ నాకు గుర్తింపు తెచ్చిపెడితే, 'మార్గన్' మూవీ మంచి అవకాశం ఇచ్చింది. హీరోయిన్‌గా ఇది నాకు తొలి సినిమా. ఆడిషన్ ద్వారా ఎంపిక చేశారు. ఇది ఒక మెడికల్ థ్రిల్లర్ మూవీ' అని వివరించారు.

విక్రమ్ ప్రభు - అనంత జంటగా 'సిరై'

విక్రమ్ ప్రభు, ఎల్‌కే అక్షయ్ కుమార్, అనంత ప్రధాన పాత్రలను పోషించిన చిత్రానికి 'సిరై' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్‌లుక్ శనివారం రిలీజ్ చేశారు. సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్ఎస్ లలిత్ కుమార్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించగా, డెబ్యూ డైరెక్టర్ సురేష్ రాజకుమారి దర్శకత్వం వహించారు. చెన్నై, వేలూరు, శివగంగ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. త్వరలోనే ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేయనున్నారు. 'టాణాక్కారన్' దర్శకుడు తమిళ్ తన నిజ జీవితంలో ఎదురైన ఒక సంఘటన ఆధారంగా చేసుకుని కథ సిద్ధం చేశారు. పోలీస్ ఉన్నతాధికారికి, విచారణ ఖైదీకి మధ్య జరిగే ట్రావెల్ జర్నీయే ఈ మూవీ అని దర్శకుడు సురేష్ రాజకుమారి వన్‌లైన్ స్టోరీగా వెల్లడించారు.



'సిరై' ఫస్ట్‌లుక్

అలనాటి జ్ఞాపకాలు చరిత్ర చెప్పే నాణేలు

● ఎగ్మూరులో ఆకట్టుకుంటున్న కాయిన్ ఎగ్జిబిషన్





విదేశీ డాలర్లు, పాత నాణేలను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు

ప్యారీస్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ధనం మూలం ఇదమ్ జగత్... డబ్బు చుట్టూ ప్రపంచ నడుస్తోంది... అయితే తాత, ముత్తాతల కాలం నాటి చిల్లుకాని, అణ, బేడ, పైసా వంటి పదాలు నేటి తరానికి కొత్తగా వినిపిస్తాయి. వేర్వేరు కాలాల్లో ద్రవ్య విలువ దేశాన్ని బట్టి మారుతూ వస్తున్నాయి. ప్రతి కరెన్సీ వెనుక అనేక కోణాల్లో తరగని చరిత్ర సంక్షిప్తమై ఉంది... గత చరిత్ర వైభవాన్ని తెలియజేసేలా పాత నాణేలు, కరెన్సీ, రాజుల కాలంనాటి తాళపత్రాలు ప్రజల కళ్లకు కట్టేలా ఎగ్మూర్ హాల్స్ రోడ్డు ఉన్న సింధు సదన్ కళ్యాణమహల్‌లో ఏర్పాటు చేసిన పాత నాణేలు, స్టాంపుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ నెల 8వ తేదీ ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆదివారం వరకు ఉదయం 10 నుండి సాయంత్రం గంటల వరకు ఉచితంగా ప్రదర్శించవచ్చు. చెన్నై కాయిన్ సంస్థ అధ్యక్షుడు మణికంఠన్ ఎన్నో వ్యయ ప్రయాసలతో ఏర్పాటు చేసిన ఈ అరుదైన ప్రదర్శనలో భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి సేకరించిన వందకు పైగా నాణేలు, స్టాంపులు, రెండు వందల యేళ్ల క్రితం నాటి చేర, చోళ, చాళుక్య, పాండ్య, పల్లవరాజుల హయాంలో ముద్రించిన వెండి, రాగి నాణేలు, తమిళ అక్షరాలతో ముద్రించిన నాణేలు, నాయకర్ రాజుల కాలంనాటి కాసులు, తంజావూరును పరిపాలించిన మరాఠాల నాణేలు, రామనాథపురం సేతుపతి నాణేలు, ఆర్కాడు నవాబు, సుల్తాన్ చక్రవర్తుల కాలంనాటి నాణేలు నేటి తరాన్ని ఆకట్టుకుంటున్నాయి. పాత 1,2,5,10,20,50 రూ.10 కరెన్సీ, ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. అలాగే విదేశీ చరిత్రను కళ్లముందుంచేలా అమెరికా, బ్రిటిష్, సింగపూర్, కేనడా, మలేసియా తదితర దేశాలకు చెందిన పాత, నేటి కాలపు డాలర్లను పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఆసక్తిగా చూస్తున్నారు. తాము పుట్టక ముందు వాడుకలో ఉన్న నాణేలు, స్టాంపులు తదితరాలతో కూడిన ప్రదర్శన చూసే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు యువత ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రదర్శనలో వెయేళ్ల క్రితం నాటి రాజరాజ చోళ చక్రవర్తులు ముద్రించిన బంగారు నాణేలు, ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన రాజేంద్ర చోళుడి రూ.1000 నాణేం ప్రదర్శనలో హైలెట్‌గా నిలిచాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసి పురాతన చరిత్ర కనిపిస్తున్న ఈ ప్రదర్శనకు ఆసక్తిగా వవస్తున్నారని, ఇక్కడ అరుదైన పాత నాణేలు, స్టాంపులను కొనుగోలు చేసే అవకాశం కల్పించినట్లు ప్రదర్శన నిర్వాహకులు మణికంఠన్ తెలిపారు. మర్నిన్ని వివరాలకు 9940720123 అనే నెంబరును సంప్రదించవచ్చు

ప్రదర్శన హాలులో సందర్శకుల రద్దీ

SUNDAY SPECIAL



బ్రోచర్ చదువుతున్న యువతి



ప్రదర్శనలో విదేశీ డాలర్లు









రాజుల కాలంనాటి రాగి, వెండి నాణేలు



చెన్నై వేపేరిలో రక్షాబంధన్ సందర్భంగా సోదరులకు రాఖీ కడుతున్న బాలికలు

గిండీ ప్రభుత్వాస్పత్రిలో స్టాలిన్ తనిఖీలు



గిండీ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని కలైంజర్ శతజయంతి స్మారక మల్టీపర్పస్ హాస్పిటల్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాంబరం వద్ద కొత్తగా జిల్లా ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొని నగరానికి తిరిగి వస్తూ మార్గమధ్యంలో గిండి ఆస్పత్రికి వెళ్ళారు. అందులో అత్యవసర చికిత్సా విభాగం సహా అన్ని విభాగాలను ఆయన తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఉద్యోగుల హాజరుపట్టీ కూడా ఆయన పరిశీలించారు. సుమారు అరగంటసేపు సీఎం ఆస్పత్రిలో తనిఖీ చేసిన తర్వాత తన నివాసానికి బయలుదేరారు.

చెరియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధిత మహిళలకు శిరోజాలు



అడయార్ క్యాన్సర్ ఆస్పత్రిలో శిరోజాల దాతతో సంస్థ నిర్వాహకులు

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రోగులకు విశిష్టసేవలందిస్తున్న ది చెరియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం అడయార్ క్యాన్సర్ ఆసుపత్రిలో 'గిఫ్ట్ హెయిర్, గిఫ్ట్ కాన్ఫిడెన్స్' పేరుతో ద్వైవార్షిక ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి 14 యేళ్లుగా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్న లైఫ్‌స్టయిల్ కోచ్ కౌటినహో హాజరయ్యారు. క్యాన్సర్ బారిన పడి తమ అందమైన శిరోజాలను కోల్పోయే మహిళలకు దాతల నుండి సేకరించిన వెంట్రుకలతో విగ్‌లు తయారు చేసివ్వటమే గిఫ్ట్ ఎయిర్ గిఫ్ట్ కాన్ఫిడెన్స్ (శిరోజాలను కానుక ఇచ్చి ఆత్మవిశ్వాసాన్ని కూడా కానుకగా ఇవ్వండి) పథకం ప్రధానోద్దేశమని చెరియన్ ఫౌండేషన్ డైరెక్టర్ వల్సా బెంజమిన్ చెరియన్ తెలిపారు. 2033లోగా పదివేల విగ్గులను క్యాన్సర్ బాధిత మహిళలకు కానుకగా ఇవ్వనున్నామని ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న నిర్వాహకులు, ప్రజలు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 3233 ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణపై అవగాహన వాకథాన్ నిర్వహించారు. 'ఇదు నమ్మ భూమి-సే నో టూ ప్లాస్టిక్ బ్యాగ్' నినాదంతో బీసెంట్ నగర్ ఎలియట్స్ బీచ్ నుంచి శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్‌లో విద్యార్థులు, రోటరీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.మద్రాసు కాఫీ హౌస్ నుంచి వాకథాన్‌ను రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్.ఐ డిస్ట్రిక్ 3233 డైరెక్టర్ రొటేరియన్ డి.దేవేంద్రన్ జెండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమంలో ఎక్స్‌నోరా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రొటేరియన్ సెందూర్,కస్టమ్స్ అండ్ జీఎస్టీ మాజీ కమిషనర్ పి.ముత్తుస్వామి సహా పలువురు ప్రముఖులు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు. వాకథాన్‌లో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రపంచ అవయవ దాన దినాన్ని పురస్కరించుకుని శనివారం చెన్నైలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీలో ప్రముఖ సినీ నటి దేవయాని



అమెరికా తెలుగు సాహితీ సదస్సుకు ఆచార్య శ్రీపురం యజ్ఞశేఖర్



పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరుగనున్న తెలుగు సాహితీ సదస్సులో పాల్గొనాలని ఆచార్య శ్రీపురం యజ్ఞశేఖర్‌కు ఆహ్వానం అందింది. యజ్ఞశేఖర్ మద్రాసు క్రైస్తవ కళాశాలలో తెలుగు ఆచార్యుడిగా 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్ తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో హ్యూస్టన్ నగరంలో జరుగనున్న తెలుగు సాహితీ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సాహితీ వేత్తలు పాల్గొననున్నారు. వారిలో ఆచార్య శ్రీపురం యజ్ఞశేఖర్ కూడా ఉన్నారు. అలాగే, అమెరికాలోని వివిధ తెలుగు సంఘాల ఆహ్వానం మేరకు నెలరోజులు ఆయన పర్యటించనున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని ఆర్ఎండీ గ్రూప్ హాస్పిటల్ అండ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రెపూబకిక శ్రీధర్ పిలుపునిచ్చారు. కీల్పాకం, టి.నగర్‌లో ఉన్న ఆర్ఎండీ హెల్త్ అకాడమీ శాఖలు ప్రారంభమైన నేపథ్యంలో, ఇటీవల విద్యార్థులు, వైద్యనిపుణులతో కలసి ప్యానల్ డిస్కషన్ నిర్వహించారు. ఆర్ఎండీ హాస్పిటల్ అంకోలజీ హెడ్ డా.రామ్, పాథాలజీ హెడ్ డా.భాస్కర రావు, గైనకాలజిస్ట్ డా.నందిత పాల్గొన్న కార్యక్రమంలో డా.రెపూబకిక శ్రీధర్ మాట్లాడుతూ... క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం చేయడంతో పాటు పోషక పదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాల్లో వైద్యం కోసం అధికంగా ప్రజలు ఆరోగ్య బీమా తీసుకుని ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారని, దేశంలో ఇంకా ఆ పరిస్థితి రాలేదని ఆమె పేర్కొన్నారు.

యజ్ఞోపవీతం పరమ పవిత్రం

● గోపురం సంస్థ అధినేత వైవీ హరికృష్ణ



గాయత్రి హోమంలో పాల్గొన్న వైవీ హరికృష్ణ, సంఘ సభ్యులు

ప్యారీస్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపమైన జంధ్యం (యజ్ఞోపవీతం) ధరించడం పరమ పవిత్రమని గోపురం కుంకుమ సంస్థ అధినేత, అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వైవీ హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం జంధ్యాల పౌర్ణమి (శ్రావణ పౌర్ణమి)ని పురస్కరించుకొని అన్నానగర్‌లోని డా.అంబేడ్కర్ అకాడమీ హాలులో అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాయత్రి, వాసవాంబలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7.15 గంటలకు హోమంతో ప్రారంభమైన ఈ పూజలో 8.45 గంటల నుంచి వేదమంత్రోచ్చారణల మధ్య యజ్ఞోపవీత ధారణ చేశారు.. సంఘ అధ్యక్షుడు గోపురం సంస్థ అధినేత వైవీ హరికృష్ణ సారథ్యం వహించిన ఈ పూజలకు ముఖ్యఅతిథిగా ట్యాబ్లెట్స్ ఇండియా అడ్వజర్ చీమకుర్తి వెంకట సుబ్బారావు హాజరయ్యారు. సంఘ కార్యదర్శులు మద్దాలి కాశీ విశ్వనాథం, ఎస్‌వీ. ప్రసాదరావు, ట్రెజరర్ ఎ.శ్రీనివాసులు, వైవీ నిరంజన్, పీజేపీఎస్ గుప్తా, కె.రవికుమార్ సహా సభ్యులు పాల్గొని గాయత్రి దేవికి పూజలు చేశారు. చివరగా అందరికి ప్రసాదాలు పంపిణీ కార్యక్రమం జరగింది.

'ఆవోపా'లో శ్రావణ పౌర్ణమి పూజలు...

స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) తమిళనాడు-తమిళనాడు వాసవి క్లబ్ ఎలైట్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రావణ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆవోపా నిర్వాహకులు రాజశేఖర్ తాడేపల్లి, సి.రంగనాథం శెట్టి, పేర్ల రాధాకృష్ణ, వాసవీ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, మన్నారు ఉదయ్‌కుమార్, ఒమ్మిన గీతా ప్రసాద్ నేతృత్వంలో ఉదయం 7.30 గంటలకు గాయత్రి దేవి, వాసవాంబలకు ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జేఎస్ చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.ఎంవీ నారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం యజ్ఞోపవీతం అనంతరం పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



జార్జిటౌన్ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆవోపా శ్రావణ పౌర్ణమి పూజలు

తిరుమలలో వైభవంగా శ్రావణ ఉపకర్మ



తిరుమలలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ-నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు శ్రీకృష్ణస్వామిని భూవరాహస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అర్చకులు అభిషేకించారు. అనంతరం స్వామివారికి నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. తర్వాత శ్రీకృష్ణస్వామిని ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి వేంచేపు చేశారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


చెత్తరహిత రాష్ట్రం దిశగా పనులు ప్రారంభించాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్



తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే దిశగా పనులు ప్రారంభించామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, వీటికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామని చెప్పారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొక్కు చెల్లించుకునేందుకు కాలినడకన తిరుమలకు వచ్చానన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అభివృద్ధి వైపు నడవాలని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.17 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,480

తలనీలాలు సమర్పించినవారు: 28,923



జూపార్కులో లయన్ సఫారీ వాహనం

జూపార్కులో సందర్శకులను ఆకట్టుకుంటున్న సింహాలు

రారాజును చూద్దాం.. రారండి

మంగళం ఆంధ్రజ్యోతి

సింహం.. అడవికి రారాజు.. ధైర్యసాహసాలకు మారుపేరు. వేటాడటంలో దీని నైపుణ్యమే వేరు. బాల్యంలో కథా వస్తువుగా నిలిచే ఈ మృగరాజు ఆఫ్రికన్ దేశాల్లో హవా చాటుకుంటున్నా మనదేశంలో అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేరిపోయింది. గుజరాత్ లాంటి కొన్ని రాష్ట్రాల అడవుల్లో మాత్రమే ఉనికి చాటుకుంటోంది. ఐదేళ్ల క్రితం నాటికి 674 సింహాలు మాత్రమే ఉన్నట్లు లెక్క తేలింది. మన రాష్ట్రంలో ప్రదర్శన శాలలకు, సర్కస్‌లో వినోదానికి పరిమితమవుతోంది. ఆదివారం సింహాల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ జూపార్క్‌లోని సింహాల గురించి తెలుసుకుందాం..

జూ పార్కులో పది సింహాలున్నాయి. వీటిలో ఐదు మగవి, ఐదు ఆడవి. వీటిలో బయట ఎన్‌క్లోజర్‌లో రెండు ఆడ, ఒక మగ సింహం ఉన్నాయి. లయన్స్ సఫారీలో నాలుడు ఆడవి, మూడు మగవి ఉన్నాయి. 2001లో సర్కస్ నుంచి తీసుకువచ్చిన 87 సింహాలలో వయసు పైబడి 86 చనిపోయాయి. వీటిలో ఒక్కటి మాత్రమే సజీవంగా ఉంది. ఈ మృగరాజుల సాధారణ వయసు 24ఏళ్లు. అడవిలో ఉండేవి 14 సంవత్సరాలు మాత్రమే బతుకుతాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. జూపార్కుల్లో సింహం 20 సంవత్సరాలకు పైగా బతుకుతుంది. సర్కస్ నుంచి తీసుకువచ్చిన సింహాలకు పుట్టినవే ఇప్పుడు జూపార్కులో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

నేడు సింహాల దినోత్సవం

సఫారీ సందర్శనకు వాహనాలు

జూపార్కులో సింహాల సఫారీలోని వెళ్లే సందర్శకుల కోసం ఆరు వాహనాలను ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా టిక్కెట్ వసూలు చేస్తున్నారు. ఈ వాహనంలో ప్రయాణిస్తూ సింహాలను దగ్గరగా చూసేందుకు అవకాశం ఉంటుంది. సింహాలు సందర్శకులపై దాడి చేయకుండా ఈ వాహనాలను కట్టుదిట్టమైన ఇనుప కంబీలతో ఏర్పాటు చేశారు.

రోజువారీ ఆహారమిలా..

జూపార్కులో సింహాలకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి ఆరు కేజీల బీఫ్, రెండు కేజీల చికెన్, రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. వీటి సంరక్షణలో జంతు ప్రేమికులను భాగస్వాములుగా చేయడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. దత్తత తీసుకునేందుకు ఆహ్వానం పలుకుతోంది. రోజుకు అయ్యే ఖర్చు రూ.1,330, వారానికి రూ.9,310, నెలకు రూ.39,900, మూడు నెలలకు 1,19,700 ఆరు నెలలకు రూ.2,39,400, సంవత్సరానికి రూ.4,85,450 మొత్తాన్ని జూపార్కు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే మీరు కూడా సింహాల సంరక్షణలో భాగస్వాములయినట్లే.

పవన్‌ను బంధించింది ఎవరు?

తిరుపతి నుంచి చిత్తూరుకు ఎలా వెళ్లాడు?

వైసీపీ దాడి ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల చేతిలో దారుణ హింసకు గురైన పవన్‌కుమార్‌ను చిత్తూరులో బంధించింది ఎవరు? అతని వాయిస్ రికార్డు చేసి వీడియోలు విడుదల చేసిందెవరు? తిరుపతిలో దాడికి గురైన పవన్ చిత్తూరుకు ఎలా వెళ్లాడు? రౌడీ మూకలకు భయపడి తలదాచుకున్నాడా? లేకుంటే ఎవరైనా బలవంతంగా తీసుకెళ్లి బంధించారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో తిరుపతికి చెందిన వైసీపీ కీలక నేతల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు.

గొడవకు కారణాలపై ఆరా

తిరుపతిలోని ఒక హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న పవన్‌కుమార్‌ను, వైసీపీ నేతలకు మధ్య గొడవకు గల కారణాలపైనా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేవలం డబ్బు వ్యవహారమేనా లేదా పాత కక్షలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు.

దర్యాప్తు వేగవంతం

ఈ ఘటనను ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకోవడంతో జిల్లా పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది టీమ్‌లుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, బైక్ రెంటల్ అధినేత జగదీశ్వరరెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల అదుపులో ఉన్న మరో నిందితుడు దినేష్‌ను విచారిస్తున్నారు. మరికొందరు అనుమానితుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ దాడి వెనుక భూమన హస్తం

- శాప్ చైర్మన్ రవినాయుడు -

తిరుపతి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడు పవన్‌పై దాడి వెనుక వైసీపీ నేతలు భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ హస్తముందని శాప్ చైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. పవన్‌ను బెదిరించి వారికి అనుకూలంగా వీడియో చేయించారని, భూమన కుటుంబం వల్ల ప్రాణహాని ఉందని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అభినయ్ ప్రధాన అనుచరుడు ఉదయ్ వంశీ ద్వారా దాడి అనంతరం పవన్‌ను కిడ్నాప్ చేశారని తెలిపారు. ఈ క్రతువుకు డబ్బు సమకూర్చింది అభినయ్ అని ఆరోపించారు. కిడ్నాపర్లు, ఉదయ్ వంశీల ఫోన్ పేలు చెక్ చేస్తే అన్ని ఆధారాలు బయటడతాయని వివరించారు. కరుణాకరరెడ్డి, అభినయ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ కల్యాణి, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం రోజా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ శ్రావణమాసం, శ్రావణ నక్షత్రం, శనివారం రోజున శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన కుటుంబంతోపాటు రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.

తిరుమలలో విజయనగరం జిల్లావాసి అదృశ్యం



సురేష్ (ఫైల్ ఫొటో)

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన విజయనగరం జిల్లావాసి కనిపించడం లేదంటూ శనివారం తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయనగరం జిల్లా, కన్పితి మ్మాపురానికి చెందిన సురేష్(37) గత నెల 19వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. అదే రోజు తిరుమలలోని యాత్రిసదన్ వద్ద కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతని కోసం తిరుమల, తిరుపతి, సొంత ఊర్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేష్ వివరాలు తెలిసిన వారు 9440796772కు తెలియజేయాలని కోరారు.

జోరుగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న శ్రీవారి తేరు, పుష్కరిణి

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. టీటీడీ ఏడాదికోసారి టీటీడీ అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఏర్పాట్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం శ్రీవారి మహారథం(చెక్కతేరు)ను సిబ్బంది సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే మాడవీధుల్లోని విద్యుత్ లైట్లకు మరమ్మత్తులు చే పట్టారు. పాడైపోయిన లైట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే శ్రీవారి పుష్కరిణిలోని నీటి ఇప్పటికే తొలగించి లోపులన్న బావుల్లో, నీటి పైపులకు మరమ్మత్తులు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా పనులన్నీ పూర్తిచేసిన తిరిగి నీటిని నింపనున్నారు. ఇక, మాడవీధులు, ఆలయ పరసర ప్రాంతాల్లో బారికేడ్లు, గ్యాలరీలను ఏర్పాటు చేసే పనులు కూడా మొదలయ్యాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో దళిత యువకుడిపై దాడి దుర్మార్గం

● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

తిరుపతి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో దళిత యువకుడిని గదిలో బంధించి వైసీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గపు చర్య అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి చేసిన వారు భూమన కరుణాకరరెడ్డి, అతని తనయుడు అభినయ్ అనుచరులని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఖండించకపోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. నిందితులు కరుణాకరరెడ్డి ఇంటి వద్ద అరెస్టు కావడంపై వారిపైనే అనుమానం వస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం కేవలం చంద్రబాబు, నితీష్ వల్ల మనుగడ సాగిస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నారని, ట్రంప్‌ను మోదీ ఇప్పటివరకు వ్యతిరేకించడం లేదని తెలిపారు. ట్రంప్ ఆర్థిక ఆంక్షల పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నా మోదీకి జ్ఞానోదయం కాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రచారంలో ఉన్న దొంగ ఓట్ల జాబితా ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతోందన్నారు. గతంలోనే ఓట్ల చేర్పులు, తొలగింపులపై తిరుపతిలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఆధారాలతో సీపీఐ ఆధ్వర్యంలో చూపించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో నిరూపించారని అన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదన్నారు. స్వతంత్ర సంస్థలుగా పనిచేయాల్సిన వ్యవస్థలు మోదీ నియంత్రణలోకి వెళ్లిపోయాయన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై న్యూయార్క్ కోర్టులో మాజీ ముఖ్యమంత్రిపై కేసు నడుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చితే దేశ వ్యాపితంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ నేతలు హరినాథ్ రెడ్డి, పి.మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యలకు ఆధునిక వైద్య పద్ధతులు

● వైద్యరంగంలో పల్మనాలజిస్టుల పాత్ర కీలకం ● అప్సకాన్ జాతీయ సదస్సులో ఎమ్మెల్యే ఆరణి



అప్సకాన్ సదస్సులో పాల్గొన్న ప్రముఖ వైద్య నిపుణులు, నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్యను నివారించేందుకు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్‌లో అప్సా (ఆంధ్రప్రదేశ్ సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియోషన్) ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రేమానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 6వ వార్షికోత్సవ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆస్మా, టీబీ, సీవోపీడీ, న్యూమోనియా వంటి ఊపిరితిత్తుల సమస్యల పరిష్కారంలో పల్మనాలజిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రుయాస్పత్రి పరిధిలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఆఫ్ పల్మనాలజీ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేకు అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పల్మనాలజీ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, నూతన పద్ధతుల గురించి వైద్య నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రాధ, సైంటిఫిక్ కమిటీ సభ్యురాలు డాక్టర్ నీతిచంద్ర పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు

● ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్



గిరిజన విద్యార్థులకు పారితోషికం అందజేస్తున్న జిల్లా కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తన దృష్టిలో ఉన్నాయన్నారు. గిరిజన భవన్ మరమ్మతుల నుంచే పనులు ప్రారంభిస్తామన్నారు. నెలాఖరులోపు రూ.20 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. తుడా చైర్మన్, కార్పొరేషన్ వారితో మాట్లాడి అదనంగా మరో రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరుతానని అన్నారు. మూడు నెలల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల మంజూరుకు చర్యలు తీసుకుంటానని, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివాసులు ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తాను 5 కుటుంబాలను దత్తత తీసుకున్నానని వచ్చే 6 నెలల్లో వారి అవసరాలను సంపూర్ణంగా నెరవేరుస్తానని పేర్కొన్నారు. జిల్లాలో 82 వేల కుటుంబాలను గుర్తించి వారిలో 42 వేల కుటుంబాలను పలువురు దత్తత తీసుకున్నారని వివరించారు. ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కలెక్టర్ పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజాసోము, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణ, బంజార సంఘం అధ్యక్షుడు తలపుల మల్లికార్జున, గిరిజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సుమన్, యానాది సంఘం మహిళా కార్యదర్శి వసంతమ్మ, విశ్రాంత డీఎఫ్‌వో. టీటీడీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లె ఆలయ చైర్మన్ రేసులో ఆ నలుగురు



సత్యవేడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి కోసం పలువురు పోటీపడుతున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పళ్లికొండేశ్వరాలయం ఒకటి. పైగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఈ ఆలయ చైర్మన్ పదవికి పోటీ ఎక్కువగా ఉంటుంది. పాలకమండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆశావహులు పైస్థాయి నేతల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కేవీబీపురానికి చెందిన తొట్టంబేడు ఏఎంసీ మాజీ చైర్మన్ రామాంజులు నాయుడి పేరు చైర్మన్ రేసులో ప్రముఖంగా వినబడుతోంది. పార్టీలో సీనియర్ నేత కావడంతో రాష్ట్రస్థాయి నేతల ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. అదేవిధంగా పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మనాభరాజు పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన కూడా చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నాగలాపురం మండలానికి చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆవుల రామ్‌ప్రకాష్ యాదవ్ ఈ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. ఈయన ఇప్పటికే యువనేత లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను సంప్రదించి దరఖాస్తు అందించి ఉన్నారు. ఇదిలా ఉండగా సత్యవేడుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సల్లా కృష్ణయ్య పేరు తెరమీదకు రావడం గమనార్హం. కృష్ణయ్య కుటుంబ సభ్యుల్లో ఒకరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.